# నమస్తే తెలంగాణ

## జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 2 నవంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


### ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో

అయిజ, నవంబర్ 1 : కర్ణాటకలోని కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం జూరాల డ్యాంకు 25,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అవుట్‌ఫ్లో 25,231 క్యూసెక్కులుగా నమోదైంది. ఆల్మట్టి డ్యాంకు ఇన్‌ఫ్లో 18,478 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 18,478 క్యూసెక్కులు, నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 16,972 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 17,344 క్యూసెక్కులు, టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 11,243 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 11,620 క్యూసెక్కులు, ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 13,787 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 13,100 క్యూసెక్కులు వచ్చి చేరింది.



మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు

- మాజీ మంత్రిపై కుట్ర
- పాలమూరులో దివ్యాంగుల ఇండ్లు కూల్చి పాపాన్ని మూటగట్టుకున్నారు
- టెలిస్కోప్ పెట్టి వెతికినా ప్రభుత్వం ఒక్క హామీ నెరవేర్చలేదు..
- పది నెలల్లోనే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా..
- శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి

# రాజకీయంగా ఎదుర్కోలేక..

మహబూబ్‌నగర్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనపై ఆయన కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించే కుట్ర జరుగుతున్నదని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రితోపాటు ఆయన తమ్ముడిపై పార్టీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఆయన తీవ్రంగా ఖండించారు. దివ్యాంగులను నిరాశ్రయులను చేసి అర్ధరాత్రి అపరాత్రి అని చూడకుండా వారిని బయటికి పంపించి వారి ఇల్లు కూలగొట్టడం అనేది నికృష్టమైన చర్య అంటూ విరుచుకుపడ్డారు. చరిత్రలో ఏ ప్రభుత్వం ఇంతటి పాపానికి పాల్పడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పాపాన్ని మూటగట్టుకున్నదని విమర్శించారు. దివ్యాంగులకు అండగా ఉన్నందుకు మాజీ మంత్రి తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్‌పై తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పత్రాలు సరిగా లేవని సృష్టించారని చెబుతూ కేసులు పెట్టారని.. బీఆర్ఎస్ హయాంలో ఆయన ఒక హోదాలో ఉన్న మంత్రి.. ప్రభుత్వం 58 జీవోను తీసుకుకొచ్చింది అవసరమనుకుంటే సవరించి వాళ్లందరికీ న్యాయం చేసేవాడు ఇలా తప్పుడు పనులు ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. ఇదంతా శ్రీనివాస్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేక ఇలాంటి కుటిల చర్యలకు పాల్పడుతుందని, ఇది రాజకీయ ప్రేరేపిత కుట్ర అంటూ మండిపడ్డారు. ఉన్నత ఉద్యోగాన్ని వదిలిపెట్టి తెలంగాణ ప్రజల ఆర్తనాదాలు విని ఉద్యోగ సంఘం నేతగా ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన ఘనత శ్రీనివాస్‌గౌడ్‌ది అన్నారు. ఆయన త్యాగాన్ని ధైర్యాన్ని మనమంతా అభినందించి తీరాల్సిందేనని అన్నారు. రాజకీయ పరిణితిలేని త్యాగానికి అర్థం తెలియని వారు ఇవాళ బీఆర్ఎస్‌పై ఇతర నేతలపై అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీనివాస్‌గౌడ్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేస్తే పబ్బం గడుపుకోవచ్చని ఆలోచనతో ఇలాంటి కుట్రలకు తెర లేపుతున్నారని దీన్ని సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎక్కడ ఎలాంటి కుట్రలు జరిగినా అది తెలంగాణ వాదం పై జరిగిన దాడిగా భావించి దీన్ని దీటుగా ప్రతిఘటిస్తామన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించినందుకు శ్రీకాంత్‌గౌడ్‌పై కేసులు పెట్టారు.. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు వరద భాస్కర్‌పై కేసు పెట్టి కొట్టారు.. ఇది ఎక్కడి దుర్మార్గమని ప్రశ్నించారు. సోషల్ మీడియా ఇప్పుడున్న మీడియాలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వెల్లడించే వేదికగా మారిందని ఇందులో భాగంగానే అన్యాయాలు అక్రమాలను ప్రజలకు తెలియాలని ఉద్దేశంతో పోస్టులు పెడితే వారిపై కేసులు పెట్టడం చిత్రహింసలకు గురిచేయడం ఇదెక్కడి సంస్కృతి అంటూ నిలదీశారు. అక్రమ కేసులు ఎందుకు పెట్టారు అంటూ అడగడానికి వచ్చిన వారందరిపై కూడా కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌ను అమెరికాతో పోటీపడే విధంగా తీర్చిదిద్దామని అదేరకంగా హైదరాబాద్‌తో పోటీపడే విధంగా మహబూబ్‌నగర్ అభివృద్ధిని శ్రీనివాస్‌గౌడ్ చేసి చూపించారని, వీటిని జీర్ణించుకోలేక రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం, పదేండ్లు మేము అధికారంలో ఉన్నాం. తెలంగాణను తీసుకొచ్చాం.. రాష్ట్ర సర్వోత్తమ అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ఇంకా ఏదో ఒకటి ఎక్కువ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పదినెలల్లో అసలు స్వరూపం తెలిపోయిందన్నారు. ప్రజలే మా జీవితకాలంలో ఇటువంటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని చూడలేదని అంటున్నారంటే మీ పాలన ఎలా ఉందో అర్థవుతుందన్నారు. రాజకీయాల్లో పట్టుమని పది నెలల్లో ఇంత వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వాన్ని నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రభుత్వంపై సానుకూలత వ్యతిరేకత కనిపిస్తుందని అలాంటిది ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైనట్లు తేటతెల్లమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందా అనే విషయాన్ని భూతద్దంలో కాదు కదా టెలిస్కోప్ పెట్టి వెతికినా కనబడని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.



### కేసులకు భయపడం : శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వం తనపై తన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టినంత మాత్రానా భయపడేది లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో 60, 70 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టేందుకు జాబితాలు సిద్ధం చేసినట్టు తెలిసిందని ఏ ఒక్కరూ భయపడవద్దని మీకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు. వరద భాస్కర్ ఇంటికి పోతే అతనిని పోలీస్ వాళ్లు కొట్టారని బాధపడితే అడుగుదామని పోతే సీఐ లేరంటే కింద కూర్చున్నాం.. దానికి కూడా కేసు నమోదు చేసారా అంటూ ప్రశ్నించారు. కూలగొట్టిన దివ్యాంగుల ఇండ్లను కట్టివ్వమని కోరినం అదికూడా తప్పా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అప్పన్నపల్లి బ్రిడ్జి నిర్మాణం రెండేండ్లలో పూర్తి చేశాం, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని పెద్ద దవాఖాన నిర్మాణం చేశాం. వీటిపై అసత్య ప్రచారాలతో ఎన్నికల్లో ఓడించారు. ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. పేదల పక్షాన అడుగుతున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాల్లో అనేక కేసులు నమోదు చేసినా జంకలేదు. ఇప్పుడు మీరు పెట్టే కేసులకు బెదిరిపోతామా.. మీ బండారాన్ని బయటపెట్టేందుకు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అధికారులు, పోలీసులు కూడా గుర్తెరిగి ప్రవర్తించాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, నాయకులు శివరాజ్, మల్లు నర్సింహారెడ్డి, ఆంజనేయులు, దేవేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, జంబులయ్య, రాఘవేందర్, నవకాంత్, అహ్మదుద్దీన్, ఇమ్రాన్, పాల సతీశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకాంత్‌గౌడ్‌కు మధుసూదనాచారి పరామర్శ

కాంగ్రెస్ నేతలు పెట్టిన అక్రమ కేసులకు రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్‌ను శుక్రవారం శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ములాఖత్ అయ్యి పరామర్శించారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు 19 మందిపై కాంగ్రెస్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల విషయాన్ని తెలుసుకొని శుక్రవారం పాలమూరుకు వచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సోదరుడు శ్రీకాంత్‌గౌడ్‌ను గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డితో కలిసి పరామర్శించారు.

# కురుమూర్తి ఉత్సవాలకు హాజరుకావాలని..

మూసాపేట, నవంబర్ 1 : కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని దేవకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులతో కలిసి ఎమ్మెల్యేలు ఆయన్ను కలిశారు. 'తాను పాలమూరు బిడ్డనే.. నేను తప్పకుండా వస్తాను' అని సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యేలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీపీసీసీ నిర్వహణ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డితోపాటు పలువురు కమిటీ సభ్యులు, అర్చకులు ఉన్నారు.



కురుమూర్తి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యేలు, ఆలయ కమిటీ సభ్యులు



నారాయణపేటలో చిచ్చుబుడ్డి కాల్చుతున్న స్థానికులు

# ధూంధాంగా దీపావళి

- ఉత్సాహంగా వెలుగు దివ్వెల పండుగ
- భక్తిశ్రద్ధలతో నోములు, వ్రతాల ఆచరణ
- ఉమ్మడి జిల్లాలో మోగిన పటాకుల మోత
- చిన్నా, పెద్ద తేడా లేకుండా సంబురాలు



వనపర్తిలో..

ఆకాశం కాంతులతో ప్రజ్వరిల్లింది. దీపాలు కాంతులీనుతుండగా.. చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనంగా దీపావళి ధూంధాంగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలుగు దివ్వెల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. నోములు, వ్రతాలను భక్తులు ఆచరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్ల లోగిళ్లు దీపకాంతులతో కళకళ లాడాయి. సాయంత్రం వేళ పటాకుల మోత హోరెత్తింది. చిన్నా పెద్ద తేడా లేకుండా కేరింతలతో పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ రకాల క్రాకర్స్‌ను కాల్చి సంబురాలు చేయగా.. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి నిర్వహించిన వేడుక అంబరాన్నంటింది.

*– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, నవంబర్ 1*

# కురుమూర్తి పవిత్రను కాపాడాలి

- భక్తులు పోలీసులకు సహకరించాలి
- బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు, ఏర్పాట్లు
- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్
- 6న స్వామివారి అలంకారోత్సవంపై సమీక్ష




ఆత్మకూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూరు, నవంబర్ 1 : భక్తులు కురుమూర్తి స్వామి పవిత్రతను కాపాడుకుంటూ పోలీసులకు సహకరించాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. ఉమ్మడి జిల్లాలోనే పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఈనెల 6న జరిగే అలంకారోత్సవంపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సమీక్ష అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు. ఆత్మకూరు ఎస్బీఐ నుంచి ప్రా రంభమయ్యే అలంకార మహోత్సవానికి రెండంచెల బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు, స్వామివారి ఆభరణాలను అ త్యంత పవిత్రంగా, సురక్షితంగా కొండపైకి చేర్చేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ ఆభరణాలను దర్శించుకోవాలని, పోలీసుల ఆంక్షలకు సహకరించాలని సూచించారు. నిర్దేశించిన రూట్ మ్యాప్ ప్రకారంగా ఆభరణాల ఊరేగింపును భారీ ఎస్కార్ట్‌తో తీసుకెళ్తామని వివరించారు. జిల్లాలో క్రైమ్‌రేట్ చాలా తగ్గింద ని, సీసీ కెమెరాల ఏర్పాటుతో కేసులు త్వరితగతిన పరిష్కరించబడుతున్నాయన్నారు. ఆధునిక సాంకేతికత్వంతో క్లిష్టమైన కేసులను సహితం సులువుగా పరిష్కరించవచ్చని చెప్పుకొచ్చారు. మొబైల్ రికవరీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. జాతరలోనూ ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకున్నా వెంటనే ఠాణాలో సంప్రదించి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శివకుమార్, ఎస్సై వాకిటి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ పూట విషాదం

- రెండు బైకులు ఢీ : ఇద్దరు యువకులు మృతి

గండీడ్, నవంబర్ 1 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకున్నది. మహ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బోరు రవి(19) కొండాపూర్ నుంచి గురువారం సల్కర్‌పేట్ వైపు వస్తుండగా కుల్కచర్ల మండలం పటేల్‌చెరువుతండాకు చెందిన ఇస్లావత్ రవి(30) సల్కర్‌పేట్ నుంచి పగిడ్యాల్ వైపు వస్తుండగా మన్సూర్‌పల్లి గేటు సమీపంలో వారి బైక్‌లు వేగంగా ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మృతుడు బోరు రవి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. పండుగ పూట జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# వేరుశనగ మిషన్‌లోపడి మహిళ మృతి

మదనాపురం, నవంబర్ 1 : ప్రమాదవశాత్తు వేరుశనగ మిషన్‌లో పడి మహిళా కూలీ మృతి చెందిన ఘటన గురువారం కొత్తకోట మండలం నాటవెల్లి పెద్ద తండా గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకున్నది. కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాటవెల్లితండాకు చెందిన రేణుక (30) దీపావళి రోజున గ్రామ సమీపంలోని ఓ రైతు పండించిన వేరుశనగను మిషన్‌లో వేసేందుకు కూలి పనులకు వెళ్లింది. వేరుశనగను మిషన్‌లో వేస్తున్న క్రమంలో మహిళ చీర మిషన్‌కు చుట్టుకున్నది. దీంతో సదరు మహిళ మిషన్‌లో పడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు. కాగా మృతురాలికి భర్త రాములునాయక్‌తో పాటు కుమారుడు ఉన్నారు. పండుగ పూట రేణుక మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 1 : ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీగార్లపాడు గ్రామానికి చెందిన లక్ష్మన్న గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజేయుడు శుక్రవారం కర్నూల్‌లో లక్ష్మన్న ఆపరేషన్ నిమిత్తం మంజూరైన రూ.5లక్షల ఎల్‌వోసీని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



మద్దిమడుగులో వెలసిన ఆంజనేయస్వామి

# మాలధారణం.. నియమాల తోరణం

- నేటి నుంచి ఆంజనేయస్వామి దీక్షలు ప్రారంభం
- మరో శబరిపీఠంగా విరాజిల్లుతున్న మద్దిమడుగు క్షేత్రం

అచ్చంపేట, నవంబర్ 1 : నల్లమలలోని మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం మరో శబరిపీఠంగా వెలుగొందుతున్నది. భక్తులు మద్దిమడుగు ఆంజనేయస్వామిని పిలిస్తే పలికే దైవంగా ఆరాధిస్తారు. 1992లో కార్తీకమాసం సందర్భంగా మద్దిమడుగు పీఠాధిపతి జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో 12మందితో మొదటిసారి మాలధారణ ప్రారంభమైంది. అప్పటి నుంచి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా మాలధారణ స్వాముల సంఖ్య భారీగా పెరిగింది. జయరాంస్వామి వారి శిష్యులు గురుస్వాములైన వారు గ్రామాలు, పట్టణాల్లో మాలలు వేయడం జరుగుతున్నది. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, హైదరాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల పరిధిలో స్వాములు పెద్ద ఎత్తున మాలధారణ చేపట్టనున్నారు. అందులో భాగంగా ఈనెల 2న (శనివారం) అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వరం క్షేత్రంలో జయరాం గురుస్వామి మాలధారణ ప్రారంభించనున్నారు. 3,4న హనుమాన్ దీక్షపీఠం లక్ష్మీనగర్ సాగర్ రోడ్డు హైదరాబాద్‌తోపాటు అచ్చంపేట, దేవరకొండ, నల్లగొండ, సూర్యాపేట, మాచర్ల, గుత్తికొండ, కారంపుడి, గుంటూరు ప్రాంతాల్లో మాలధారణ జరుగనుంది. ఈనెల 21నుంచి 25 వరకు అర్ధ మండల దీక్ష స్వీకరణ ఉంటుంది. డిసెంబర్ 14న సీతారామస్వామి కల్యాణం, హనుమాన్ పడిపూజ, 15న మార్గశిర పౌర్ణమి సందర్భంగా మద్దిమడుగులో హనుమత్ గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి, మాలవిరమణ నిర్వహించనున్నారు.

మాలధారణ సందర్భంగా నల్లమలలోని మద్దిమడుగు క్షేత్రం లక్షల సంఖ్యలో తరలిరానున్న భక్తులను దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

### కనీస వసతులు కల్పించాలి



మద్దిమడుగు ఆంజనేయస్వామి పిలిస్తే పలికే దైవం. 1992లో స్వామివారు స్వప్నంలో చెప్పినప్పుడు 12 మందితో మాలధారణ ప్రారంభించాను. నేడు రెండు రాష్ట్రాల్లో లక్షలమంది మాలధారణ స్వీకరిస్తున్నారు. 41రోజులు మండల దీక్ష పూర్తి చేసుకొని మద్దిమడుగు క్షేత్రానికి కుటుంబ సమేతంగా ఇరుముడితో స్వామివారి సన్నిధికి భారీగా తరలివస్తున్నారు. అక్కడ భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి, స్నానాలు గదులు పెంచాలి. మాలధారణ స్వాములకు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేయాలి. తలనీలాల కౌంటర్లు పెంచి, రాత్రివేళ కూడా తెరిచి ఉంచేలా చూడాలి. భక్తుల కోసం 5రోజులు అన్నదానం కొనసాగించాలి. మహిళల కోసం ప్రత్యేకంగా తాత్కాలికంగా స్నానపు గదులు ఏర్పాటు చేయాలి. కోటమైసమ్మ ఆలయంలో హలాల్ నిషేధం బోర్డు ఏర్పాటు చేయాలి. జాతర సమయంలో ఐదు రోజుల పాటు టోల్‌గేట్ రుసుము లేకుండా చూడాలి. రాత్రివేళ నిద్రించేందుకు భక్తులకు ప్రాంగణంలో టెంట్లు వేయించాలి. పడిపూజ, గాయత్రి మహాయజ్ఞం ఇతర పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

**–జయరాం గురుస్వామి, మాలధారణ వ్యవస్థాపకులు**



మద్దిమడుగులో ఆంజనేయస్వామి మాలధారణ స్వీకరించిన స్వాములు (ఫైల్)